శరీరయజ్ఞము

[క్రీ. శ. 1561-1562 ఏఁడుల నాఁటి చరిత్రకు సంబంధించిన నవల]

కథకుడు

విద్వాన్ టి. ఆర్ముగం పిళ్లె

హుమయూన్ చక్రవర్తి మరణించినప్పు డక్బరు పదుమూఁడేఁడుల యర్భకుఁడు. ముక్కుపచ్చ లారని యాపిన్నవయసుననే యతఁడు తన గురు వగు బహారాంఖానని సాయమున సికందర్ షా, అడాలీ, విక్రమాదిత్య బిరుదనామం బగు హీమూ మొదలగు ప్రబలశత్రువర్గమును రూపుమాపి తనతండ్రిసింహపీఠిక నధిష్ఠించెను.

బహారాంఖానుఁ డక్బరు పదునెనిమిదేఁడులవయస్కుఁడైనప్పుడు కూడ తన నిరంకుశాధికారమునఁ గొన్ని యత్యాచారములచేత నతని మనస్సును నొప్పించుచుండినందున చక్రవర్తి రాజ్యవ్యవహారములను స్వయముగ స్వతంత్రించి నడుపనారంభించి, తత్సంకల్పమునకుఁ దొలిపూజగ బహారాంఖానుని మక్కాఫకీరుగ నొనర్చెను.

అట్లు స్వతంత్రించిన అక్బరుపాదుషా పాలనమును సహింపక మాళవము నేలుచుండిన బాజ్ బహదూరనెడి వాఁడు తిరుగుఁబాటు సూపి చెలరేఁగెను. అతని నణఁగఁద్రొక్కుటకు ఆదంఖాన్ అనెడు తన సరదారు నొక్కనిఁ బంపఁగా నతఁడు సారంగపురము సమీపమున బాజ్ బహదూరును సంపూర్ణముగ నోడించి, మాళవముఖ్యనగరమగు ఉజ్జయినీ పట్టణమును జేరుకొనియెను.

బాజ్ బహదూరున కొక హైందవ భార్య రూపసి, రూపమతియనునది కలదు. ఆమె కోటతలుపులుమూసికొని యాదంఖాను నెదిరించి పోరెను. అతఁ డా ప్రహరిగోడ నొకచోఁ బగిల్చి యాశిథిలములచే నగడ్తఁ బూడిచి యశ్వారూఢుఁడై పురప్రవేశ మొనర్చెను!

రాణి రూపమతీదేవి ధైర్యసాహసములు తాన చూచి యాశ్చర్యచకితుఁడైన యాదంఖానుఁడు తిన్నఁగ నామె నివాసముఁ జొచ్చి తన్నుఁ బరిణయ మాడిన దో నామె రాణీపదవిని స్థిర మొనర్చెదనని యామెకు కబురంపెను. రూపమతి వాని బారినుండి విమోచన మందు మార్గ మెఱుఁగక నాఁటిరాత్రికి రమ్మని చెప్పి పంపెను.

నిర్దిష్టసమయమున కాతఁ డత్యంతోత్సాహపరవశుఁడై యంతిపురికేగుదెంచి రాణిగారున్న గదిలోనికి వెళ్లెను. హంసతూలికాతల్పమున రాణి సాలంకృతయై మేలినలిచీరముసుఁగిడియొక ప్రక్కకొరగికూర్చుండి యాతనిరాకకై యత్యంతసంతోషమునఁ బ్రతీక్షించుచుండెనట్లు వ్యక్తముకాఁగా నాదంఖానుఁడు తన నోము ఫలించెనని యువ్విళ్లూరుచు, బిరబిర వెళ్లి యామె ప్రక్కన కూర్చుండెను.

పాప, మామెకు సిగ్గధికముకాఁబోలును, మౌనముగా నుండెనని సరసంపు హావభావములు వ్యక్తపఱచుచు నామెముసుఁగును స్వతంత్రించి తీసివైచినాఁడు. రూపమతీదేవి విషపానము చేసి చచ్చియుండెను!

* * *

హుమయూను చక్రవర్తి కనేక భోగస్త్రీ లుండిరి. వారిలో మాహం అంగా యనునామె యగ్రగణ్య.

ఆమెయొక్క అపత్య మాదంఖాన్ సరదారుఁడు. కావున నక్బ రాతని మిక్కిలి విశ్వాసపాత్రుఁడనియే నమ్మియుండువాఁడు. అదియుఁగాక మాహాం అంగా తన పాలకజనని కావున నామెపుత్రుఁడు తన కత్యంతము కూర్చువాఁ డని యెంచియుండెను. ఆదంఖానుఁడు గొప్ప శూరుఁడు. కావున నాతఁడు పాదుషావారి విశ్వాసమున కెంతయుఁ దగినవాఁ డనియే యనవలయును. మాళవదేశమును జయించినాఁడు కావునఁ దాత్కాలికముగ రాజప్రతినిధియై రాచ కార్యములఁ జూడ నారంభించెను.

అక్బరుపేర శాసనము లనేకము సృష్టింపఁబడెను. రాష్ట్రమున విప్లవకారుల రూపుమాపవలయు నని ఆదంఖానుఁడు చేయ లసిన సమస్త శాసనములను జేసి యాచరణ కుంచెను. ధర్మవ్యవస్థను జక్కఁగా నెలకొల్పవలయు నని, దయాదాక్షిణ్యములు లేక, స్త్రీవృద్ధ శిశువివక్ష లేక, విద్రోహులని యనుమానమున్నంత మాత్రమునఁ బూర్వాపరవిచారణ లేక వారి నందఱ నతిదారుణముగఁ జిత్రవధ గావించెను. న్యాయాచరణమను నెపమున నాతఁ డొనరింపని యక్రమములు లేవు

రాజద్రోహు లని పరిగణింపఁబడినవారిలో నుజ్జయినీనివాసి యగు విష్ణుపండితుఁడను యువకుఁ డొక్కఁడు. అతఁ డొనర్చిన విద్రోహమేదియో విస్పష్టపడలేదు. కాని యాతని వ్రాలున్న లేఖ యొక్కటి బాజ్ బహాదూరునింట లభించినదే గొప్ప నేరముగ నిశ్చయింపఁబడినది.

సింహాసవేదికపై సుఖాసీనుఁ డయి నిండోలగమున్న రాజప్రతినిధియెదుట పెడతెక్కలు విఱిచికట్టఁబడిన విష్ణుపండితుఁడు నిలువఁబెట్టఁబడెను. నిమ్మపండువంటి మైచాయ; సుందరమైన విగ్రహము; చెక్కితీర్చినట్లుండు నవయవస్ఫూర్తి; నూనూఁగుమీసలు; చక్కని బ్రాహ్మణతేజ ముట్టిపడుచుండ నాతఁడు భగవత్సాక్షిగఁ దానెట్టి విద్రోహులతోడను జేరియుండలేదని ప్రమాణ మొనర్చెను.

దొరకిన జాబువిషయమై ప్రశ్నింపఁ నతఁడు చిఱునవ్వు దొలుకాడుచుండఁ దా నాతేదీనాఁ డుదయపురమున నవోఢయైన తన భార్యతోఁ దోలికూటమిసంబరమున మునిఁగియుంటి ననియు, మానవుని జీవితమున నట్టి మహదానందదాయకమయిన వేళ నెట్టి విద్రోహములైనఁ దలపెట్ట నవకాశ మేర్పడుట హాస్యాస్పదమనియు నుగ్గడించి, తా నట్లు చెప్పికొనవలసివచ్చినందులకు యువకులకు సహజమైన సిగ్గును వ్యక్తపఱచు నొక్క చిన్ననవ్వు నవ్వెను.

ఆ నవ్వు తురుష్కునకుఁ గనుఁ గ్రుచ్చెను. “కాఫిరు” లెవ్వరుకాని తన యెదుట నవ్వుటయన్న నది తనవ్యక్తిగౌరవమునకును, నుద్యోగిగాంభీర్యమునకును లోపమును సూచించునని వాని నిశ్చితాభిప్రాయము. రాజభీతి లేమిచే వా రట్లు ప్రవర్తించుచుండిరని యాతని మతము.

బొమలు ముడివడ ఖయిదీని గుండె లవియునట్లు తీవ్రదృక్కుల చూచి “జాబులోని నీ సంతకమున కేమందువు?” అని ప్రశ్నించెను.

“అది నా పేరుమాత్రమే సంతకముమాత్రము ముమ్మాటికిఁగాదు”

“ఏమి తెలివి! అందున నేమిభేదమున్నది? వ్యక్తపఱుపుము.”

తన కెంతమాత్రము భయములేదనుకొని యాపాఱుఁడు చాపలమునఁ గొంత యధికప్రసంగము చేయుటకు సాహసించెను. నిరపరాధిత్వము తనకు బాసటయై యుండఁగా నక్బరుసార్వభౌముని సామ్రాజ్యమునఁ దా నెవ్వరికి భయపడవలయును? అందున నీతుఱక తన తెలివిని సంప్రశ్నించుచుండెను. కావున ముందువెనుక లాలోచింపక “ఈ మాత్రపుఁ దెలివిడి ఇచ్చట మూఁగియున్న నీ మ్రుక్కడిబంటెవ్వఁడేని నీ కేకరువుపెట్టఁగలఁడు. అడిగి చూడుము.” అని ప్రతివచన మాడెను.

ఆదంఖానున కంతమాత్రము దుస్సహమయ్యెను. దేహమంతయు వేయితేళ్లు కుట్టినట్లు మండిపోయినది. కన్నులు నిప్పుకలు గురియ “ఛీ, కాఫిరుగాడిదా, నోరుమూయుము. నీ బొంకనటక్కులు నాయెదుట విప్పకుము. ఎవరి తెలివి యెవరి నేమి చేయునో తెలిసికొందువు, కానిమ్ము” అని, సేవకులకు “ఈ సూకరమును చెఱయందుంపుఁడు. తరువాత వీని పని చూచెదము.” అని యాజ్ఞాపించెను. ముష్కరులగు తురుష్కులాతని బిరబిర నీడ్చికొని వెళ్లుచుండ సచివుఁ డొక్కఁడు “ఆతని మాటల యాథార్థ్యము గనుఁగొనుట కెంత సేపగును? అతని భార్యనో, బంధువులనో యడిగినఁ జాలదా?” అని యుపపాదనము చేసెను.

"దర్యాప్తు చేసి చూడుఁడు. వాఁడ సత్యవాది యనియే తీర్మానము కాఁగలదు."

అట్టి దర్యాప్తేదియు జరుగలేదు. మరునాఁటి సంజకడ విష్ణుపండితుని భార్య, ఇందిరాదేవి యాదంఖానుని దర్శించెను. "ప్రభూ, నాఁతి నిరపరాధి. రాజద్రోహ మెన్నఁడును దలపెట్టి యెఱుఁగఁడు. దైవసాక్షిగ నేను ప్రమాణ మొనర్చుచున్నాను. ఆ జాబులోని తారీకున నామగఁడు నా తల్లిగారింట నుండెను. ధర్మదాతలు నా పలుకులను విశ్వసించి నా భర్తను విడిపించి రక్షింపుఁడు." అని యతిదీనముగ రెండుచేతుల సాఁచి వేఁడుకొనియెను.

అశ్రుకణవిభాస్వంత మయిన యా సుందరకపోలములఁ జూచి, వెడద కండోయి సొంపు నెంచి, తరుణారుణాధరబింబమును బెకల్చుకొని వచ్చుచుండు మల్లెమొగ్గ వంటి దశనకాంతుల గణించి యాదంఖానుఁడు నిస్తబ్ధుఁడై కొంత సేపట్టె తెప్పవేయక నోరు దెఱచుకొని తేఱిపాఱఁజూచుచుండెను. అనిర్వాచ్యమైన మందహాస మొక్కటి యిగురెత్తి వానిపెదవులనడుమ నిటునటు దుందుడుకు సేయనారంభించెను. క్షణక్షణమున కాతని నేత్రద్వయ మా సౌందర్యరాశి గొల్పుచున్న మిఱుమిట్లచే గాఁబోలు దిగ్భ్రమ సూచింపుచుండెను. ఎట్టకేల కాతఁడు,

"కాంతామణీ, నీ మగఁడు ద్రోహియేయని ఋజువొనర్చు ప్రబల సాక్ష్యమున్నది. దానిని నీవ చూడు" మనుచు లేచి సమీపముననున్న యొక బీరువా తెఱచెను. అందొక లేఖ నెత్తియుండలి "చేవ్రాలు" మాత్ర మగపడున ట్లామెకెట్టెదుట దానిని బట్టి "ఈ పేరెవ్వరిదో చదువుము" అని నుడివెను.

బాష్పధారాప్లావితమైన వదనారవిందమును దుడిచికొని ఇందిర తోడనే "పేరుమాత్రము నా మగనిదే కాని వ్రాలుమాత్ర మాతనిది కానేరదు. లోకమున నెందఱు విష్ణుపండితులు లేరు?......" అని విస్పష్టముగఁ జెప్పెను.

ఆదంఖానుఁ డొక్క వికటవికృతహాస మొనర్చెను. సంపూర్ణచంద్రసన్నిభమయిన ఆయమ వదనపుండరీకమును గబళించివైచెడునట్లు చూచుచు నిలుచుండెను. ఆ చూపుల యంతరార్థ మామె కవగతము కాలేదు. సహజముగ స్త్రీజనమునకు ప్రకృతిలో నట్టిచూపులయందే విపత్తిమిడియున్నదో యెఱుకతట్టుట కలదు. తా నొక్క యగాధమయిన భయంకర వాపీతటమున నొంటికాలిపై నిలిచియుంటి నని యామె కుత్తట్టెను. దేహ మాపాదమస్తకము కంపించిపోయెను. వాని కపటదృష్టి యువతీజనప్రాణాధికమైన జీవనసర్వస్వమును గబళింపఁగోరుచుండెను.

"అనుపమాంగీ, నీ వచనముల విశ్వసించితినేని విష్ణుపండితుఁడు విమోచనీయుఁడే. కాని......"

"విశ్వసింప కేల పోవలయును? నా మాటలలోని యాథార్థ్యమును బలపఱచుటకు మా బంధుకోటి యున్నది."

"బేలా, నా కొక్కనిసాక్ష్య మేల కావలయును?" అని నర్మగర్భముగఁ గనుఁగొని "వలచితినేని, నీ మాటలను నమ్మకున్నను, నీకొఱకై యీ వ్రాలు నీభర్తది కాదని యొప్పుకొందును."

పాప మాయువతి కాతనిపలుకు లర్థముకాలేదు. కాని యాతని ప్రవర్తన మతివిచిత్రముగ మాత్రము వ్యక్తమగుచుండఁగా నామె బాష్పసిక్తనయనములు తనదృష్టుల నిరోధించుచుండ నట్లే కొయ్యవాఱి నిలుచుండెను.

"మోహనాంగీ, ఇదిగో — ఇటు చూడుము. నీ ప్రాణేశ్వరుని యసువులను నీ సుందరకరారవిందములయందుంచెదను. నీ యిష్టము, దాని నేమయినఁ జేసికొనుము. నాశనముచేసెడు నిర్దయాత్మవు కా వనుకొందును." అని తన స్వాధీనమున నున్న మార్దవము నంతయుఁ గేంద్రీకరించికొని యల్లనల్లన వచింపుచుఁ దనకున్న ప్రసన్నభావము నంతయుఁ బ్రదర్శించి యామెను మిక్కిలి సమీపించెను.

ఇందిర వానిసాన్నిహిత్యమును గుఱుతించులోపున నాగుఁబామువలె వాని దక్షిణహస్త మామె లేఁగానునఁ బ్రాఁకులాడెను. కెవ్వన నొక్క చావుకేక వైచి యాసాధ్వి విలవిలఁ దన్నుకొని వానిచేతిని విదల్చివైచి దూరముగఁ బాఱిపోయెను.

తన మనోరథ మీరీతి భగ్నము కాఁగా నవమానకశాఘాత బాధితుఁడై కోపానల జ్వాలలు ప్రజ్వరిల్ల నాతఁడు కర్కశస్వరమున "మఱొక్కసారి బిగ్గఱగనైన నూపిరి విడిచితివా నీ మగనికండలు గోసి కాకులపాలఁ బడవైచెదను. జాగ్రత్త సుమా" అని

క్రౌర్య ముట్టిపడ కఠినముగ గద్దించెను.

"సన్నానలికి పోనిండు" అని యిందిర ద్వారమువంకకుఁ బరువిడెను. అదృష్టవశ మేదియో తోఁప వెనుక నుండి యదలించి తఱుమువానివలె "అసత్యవాదినీ, నీ విట్టి యబద్ధముల నాకడఁ జెప్పరాకుము. పొమ్మావల" అనుచుండెను. ఆమె వానిమాటలను వినిపించుకొనక తనదారిని తాను వెళ్లెను.

ఆమె యిలుసేరుటయే తడవుగ రాజభటుఁ డొక్కఁడే తెంచి "మఱునాఁటి వఱువాత విష్ణుగుప్తుఁ డురితీయింపఁబడు"నని రాజాజ్ఞఁ జదివి వినిపించి వెళ్లెను.

విశ్వ మంతయు నా సతీమణికి గాఢాంధకారమయమయి కన్పట్టెను. ఇఁకేమున్నది? తన ప్రాణాధికుఁడైన పతిదేవుఁ డిఁక లేఁడు. ఆమెలోని జీవనజ్యోతి యాఱిపోవును. ఆపై లోకమునఁ దన బ్రదుకు సర్వశూన్యమై పోవును.

అంతలో నామెకు మఱొక్క యాలోచన స్ఫురించెను. "పాణిగ్రహణము దొట్టి దృఢతమానురాగముతోఁ దన్ను సౌభాగ్యాంబుధినిఁ దొప్పఁదోఁగఁ జేసిన యాతనితో సహగమన మొనర్చి యేల వెన్నాడరాదు? ఇదియే చక్కని యుపాయము."

అట్లామె యానాఁ డంతయు జలమయిన ముట్టక ఉపవసించి, సాయంసమయము కాఁగా నొకపరిచారికను వెంటఁబెట్టుకొని తనమగఁ డున్న చెఱసాలకడ కేఁగెను.

కారాగృహాధికారికిఁ దన్నెఱింగించుకొని తన జీవితేశ్వరుని కడసారి చూచిపోనిమ్మని వేఁడెను. కారాపతియుఁ గొంతసే పాలోచించి నిరాకరించునట్లు తన కే యుదనపు టుత్తరువును లేమిచే నామెను విష్ణుపండితుఁ డున్న భూగర్భస్థమైన గదిలోఁ బ్రవేశపెట్టెను.

ఇఁకఁ గొన్ని గంటలలో మృత్యువువాతఁబడకతప్పదని సంపూర్ణముగ నెఱింగిన యాపాపుఁ డాపాదమస్తకము పాలిపోయి జీవచ్ఛవమై పడియుండెను. తన నిర్దోషత్వముతో ధనయౌవనములు, నాత్మవిశ్వాసము ముప్పిరిగొన్నప్పు డాత్మగౌరవముఁ గాపాడుకొనుటకై చాపలమున నిసుమంత యధికప్రసంగము గావించి రాజప్రతినిధికోపాగ్నియందు శలభప్రాయుఁడై పాతికేఁడు లయిన నిండని పసితనమున నకాలయముని నోటఁ బడవలసివచ్చెనుగదా యని చింతచేఁ గుమిలిపోవుచుండెను. ఆనాఁ డరిభీకరుఁ డగు నాదంఖానుని తృణీకరించి యాత్మగౌరవమును గాపాడుకొనఁ దెగింపుతో నిట్ట నిలిచిన చత్రాతిగుండియ జన్నిగ ట్టాతఁడు నేఁడు కాఁడు.

నిష్ఫలకోపమున మాటిమాటికిని గఱవఁబడి కాటులువడి కందిపోయిన పెదవులును, నిష్ప్రయోజనమైన తన జీవితగాథను దలఁచి తలఁచి యుద్వేలావేగమున నూడఁబెఱికికొని క్షేపించి చెల్లాచెదరై ముఖమండలమును గప్పియున్నట్టి కేశములును, నాసన్నమరణమునకై భయముపడి పొరలాడి పొరలాడి పీలికలుగా నయిన వస్త్రములును, ధూళిధూసరితశరీరమును గల యా యువకుఁ డతిదైన్యమున చూపఱులగుండె లవిసిపోవునట్లుగ లాఱ్చుచుండెను.

తన ప్రాణాధికమైన యిందిరను బొడగాంచినదే ఒక్కగంతు వైచి యామె కంఠమును బిగ్గ కౌఁగిలించి తన యుత్తమాంగ మామెవక్షస్థలమున నిడి బాలకునివలె వెక్కివెక్కి యేడువసాగెను. ఆ యబలయుఁ దన జీవితేశ్వరుని బాదివిగట్టి దక్షముబ్బికొనుచు రా పతిమాత్రముగ రోదింపఁజొచ్చెను.

ఒకరిమొగ మొకరు చూచిచూచి యాదంపతు లెంతసేపేడ్చిరో తెలియదు.

ఏపాప మెఱుఁగనివానిపై రాజద్రోహనేరము మోపిరిగదా యనియు, నిందలపాలయి యధమాధముగఁ జావవలసివచ్చిన విధివిధానమును దూషించియు, నాదంఖానుని దౌష్ట్యమును నిందించియు, నెట్లో యూరటఁదెచ్చికొనఁ బ్రయత్నించి విఫలుఁడై యాతఁడు రోదనమును శరణము నందెను.

ఇందిర యిఁక నోర్వలేక "పరమేశ్వరా, నా జీవితేశ్వరునిజీవము లఱచేతఁ బడియుండ నద్దానిఁ బొఱవైచినట్టి నా బేలతనము నేల సహించెదవు?..." అని ప్రలాపించుచుండ విష్ణుపండితుఁ డులికిపడిలేచి "ఏమంటివి? ఏమంటివి? నా రక్షణోపాయము నీ యఱచేతఁ బడెనా? దానిని నీవు వమ్ముచేసితివా?-ఏమి?- ఎట్లు?- ఏల?" అని వేయిప్రశ్నల నాపిరాడకుండ నామె నడిగెను.

"నాథా, సత్యము. కాని దానికిఁ బ్రతిమాల్యము..."

"మూల్యమా? మూల్యమునా యాచించుకొని నన్ను కటికవాని కర్పించితివి? ఛీ, భార్యా రూపమున నున్న పిశాచమా? నీముఖము చూచిన దురితము. పో మ్మావలకు, పో మ్మావల" కని యామె నున్మత్తుఁడై చావబాదెను.

పాప మాసుకతి దెబ్బలు తినుచునే జరిగిన సమస్త వృత్తాంతమును నివేదించెను.

ఆమెకథ నంతయు మెట్టుమెట్టుగ విన్న యాతని కానరాధమునిపైఁ గలిగిన క్రోధమునకు మేరలేదు. నిలువెల్లఁ గంపించుచుండ నాతఁడు లేచి పండ్లు పటపటఁ గొఱికి "లంజాయాః పుత్రుఁడు" అని మేఘగర్జన మొనరించి, నిర్ధనుని యాటోపమువంటి తన వ్యర్థకోపమునకై తత్క్షణము సిగ్గుపడెను.

ఆతని హృదయపరివర్తనమును గమనించి యా పతివ్రత "హృదయేశ్వరా, యీ మహావిపత్తునుండి విమోచనమార్గ మగపడదు. తొలుత మీ రట్లయిన నాదృశ్యమును నేను జూడనోపను, వినజాలను. తొలుత నే నెట్లయిన మరణించెద. కాన నేను మిమ్మచటఁ గలసికొనుటకై ప్రతీక్షించుచుండవచ్చును." అని యేడ్చెను.

మృత్యుదేవత మహాభీకర మైన తన వదనగహ్వరము తెఱచికొని కరాళదంష్ట్రల ధాళధళ్యమున కన్నులకు మిఱుమిట్లు గొల్పుచు నాలుక చాఁచి ఒక్క కబళమున మ్రింగివేయుటకై యెదుట లొట్టవేయుచుఁ బొడకట్టుచున్నది. క్షణక్షణమునఁ దా నాదీర్ఘజిహ్వాపాశమునఁ జుట్టుకొనఁబడుచు ముఖము వైపున కాకర్షింపఁబడుచు పలుమొనలచే కండతుండెములుగ చీల్చఁబడి కరకరనమిలి వేయఁబడుచున్నాఁడు. పంచేంద్రియములు స్వాధీనమున నున్నప్పుడే చిత్రవధ గావింపఁబడి యాతన ననుభవించుచుండెను. తల దిమ్మెక్కినది. మహా దారుణముగ నిట్లు మరణింప నాతనికి మనసొప్పలేదు. ప్రాణము లత్యంతమధురము లయి యున్నవి. యౌవనపుముచ్చటలుఁ దనివార నొక్కపరియైనఁ జవిచూచి యెఱుఁగఁడు. పిదిలి పిదిలి వచ్చు దుఃఖమున బావురుమని యొక్కపెద్దయేడుపేడ్చినాఁడు. జీవితేశ్వరి నట్టె యదిమి కౌఁగిలించుకొని "ఇందిరా, ఇందిరా, నా... నాకు మతిపోయినది. అయ్యో, నిరపరాధుఁడను నే నీపాడుచావు చావలేను. ప్రాణసంరక్షణార్థమై యేమొనర్చిన నేమి? దోషాదోషము లెంతవఱకు మనల నంటియుండును? ఒకవేళ నీ వట్లొనర్చితే యుండిన—హృదయమునకును మనసునకును సంబంధములేని యీ ప్రవర్తన మొక-ఒక-శరీరయజ్ఞముగఁ బరిణమించి...పరిగణింపఁబడవచ్చునేమో!......అబ్బ నాకు నిజముగ మతి తప్పిపోవుచున్నది......" అని యాతఁడు తన పలుకుల నైచ్యమునకుఁ దానే క్రుంగిపోయి కూలఁబడినాఁడు.

లోకమున నెట్టిపౌరుషహీనుఁ డయినను ధర్మపత్నితో నిట్టిమాటలాడియుండకపోవచ్చును. పౌరుషమునకును మేరయనునది యొక్కటున్నది. ఎట్లున్నను మొత్తముపయి నాతఁడు నొక్కమానవుఁడేకదా!

ఇందిర భర్తకేసి చూచుచు నట్టె చైతన్యశూన్యమై నిలిచెను.

ఆతని పలుకు లొక్కొక్కటియు నామెహృదయమున దృఢముగఁ బాదుకొనినవి. ఆతని యాతనఁ జూచి గుండియలవియ నామెకేమియో తోఁచినది. చివాలున లేచి మొగము మూసికొని విలపించుభర్తను నిదానించి పరికించి చిటుకుపాటులో మన కుండ బిరబిర వెడలిపోయెను.

చెఱసాలవాకిట నిలిచియుండిన తన పరిచారిక నింటికిఁ బంపెను. ఆ నిశీథమున నామె లీనమైపోయినది.

అదంభామఁ డప్పుడే శయనాగారమున కేఁగుచుండెను. ద్రాక్షారసపానమత్తుఁడై కన్నులరమూసికొని కాళ్లీడ్చుకొనుచు నాతఁడు పక్కఁజేరి యందొఱఁగెను. అట్టి వేళయం దాతని యెదుట ఇందిర ప్రవేశపెట్టఁబడెను. ఆమెదర్శనమున నాతఁ డులికిపడియున్మత్తతపటాపంచలగుచు "కామిని సేవకున కేమి యాజ్ఞ?" యని వికటవినమ్రుఁడై వికృతముగ మోఁకరించెను.

ఆమె వాని కుటిలతను నిరసనభావమునఁ దృణీకరించుచు "ఒక్కక్షణ మేకాంతసంభాషణమున కనుజ్ఞ కావలయును" అని కట్టువాఱిన మొగముతో నడిగెను. వాఁడు తన గది నొక్కపరి చుట్టును పరికించునంతలో నెక్కడి పరిచారిక లక్కడక్కడ అదృశ్యలైపోయిరి. మరల నతఁడు కృత్రిమమును, హేళనమిశ్రితమును నయినస్వరమున "ఆజ్ఞ" యని గుంజెళ్లించువానివలె నరమోఁకరించెను. జుగుప్సాకరములైన వాని సర్వ

చేష్టల నామె గుండె ఱాయి చేసికొని సహించినది. "అయ్యా, నా భర్త బ్రదుకు తెరవాఁ డీ యుదయమున సూచన మొనర్చితివి......"

విస్మయాద్భుతములచే నతఁ డొకింత తొట్రుపాటు పొందినాఁడు. వెంటనే "విరహిణీ, నీ వమితకుశాగ్రబుద్ధివి. నీపతిసేవన మద్వితీయము. ఇదిగో ఒక్క సూక్ష్మము గ్రహింపుము-నీభర్త జీవింపఁగలఁడు.

"మాళవమున నేఁడు నేన సమస్త ప్రాణుల రక్షింపను శిక్షింపను దక్షుఁడను. ప్రత్యక్షపరమేశ్వరుఁడను. అట్టి యాశక్తిని నీ మగనివిషయమయి, నీ యశ్రుచేత విడుచుచున్నాను. నాయెడ నీకృపాకటాక్ష మున్నదని వచింపుము. చాలును. ఇదిగో నీమగఁ డీక్షణమున చెఱవిడివడినాఁడు." అనెను.

"నా పునరాగమన మా మాట వనించినట్లే." అని యా బ్రాహ్మణి నిరంతర మేకధారగా ప్రవహించుచున్న బాష్పములను గోనగోట మీటికొనుచు ప్రతివచియించెను.

* * *

* * *

అరుణోదయ మింకను కాలేదు. ఉజ్జయినీపుర కారాగారకవాట పాటనమునకయి యది బ్రద్దలగురీతి నిందిర దబదబ గ్రుద్దెను. ఇట్టివేళ నెవ్వరా యని చెఱనాయకుఁడు తలుపులఁ దెఱచెను. అతనిచేత నత్యంతావసరముగ నిందిర యొక ఫర్మానాను దుఱిమి "క్షణమైన నాలసింపకు" మని మందలించెను.

అతఁ డాపత్త్రిమును జదివి యామెను దేఱిపాఱఁజూచి యాడు విఱిచెను. అతని ప్రవర్తనమున కచ్చెరువడుచుండు నామెయెదుట విష్ణుపండితుఁ డుండినగదితలుపు తెఱవఁబడియుండుట కన్పట్టెను. తోడనే యామె యా చీఁకటికొట్టున దూఱి "నాథా, నాథా" అని బిగ్గఱగ నేదో చెప్పరాని లోఁదడ కుతూకను సిరోధించుచుండ నఱచెను.

ఆమె కా గాఢాంధకారమునఁ దన ప్రతిధ్వని వెక్కిరించుచున్నట్లుండెను. బదులు లేదు.

ఇంతలో చెఱసాలయధికారి మినుకుమినుకు మనుచున్న దీపముతో నాగదిఁ బ్రవేశించెను. ఆ యఱవెలుఁగున గదినడుమ త్రాడు మెడఁజుట్టి వ్రేలాడుచుండిన విష్ణుపండితుని శవము కన్పట్టెను ఆ యువతి కాఱుమని చావుకేక వైచి నిట్టనిలువునఁ గూలిపోయినది.

స్పృహనందిన వెంటనే యామెకు తనచేత నున్న రాజాజ్ఞను జదువ సిచ్చెను. అది "విష్ణుపండితుని అర్ధరాత్రమునకే ఉరిదీసియుంచవలయు" నని యున్నది.

నీచాతినీచమును, ఘోరాతిఘోరమును నగు నట్టి యాయనూనుమమున కామె భీషణరోషానలదందహ్యమాన మానసయై తీవ్రతర ప్రతిహింసచేఁగాని తనకసి తీర దని దారుణముగ ప్రతిజ్ఞ చేసికొనెను. ప్రతిహింసానమయప్రతీక్షణమే యామె ప్రకృతకర్తవ్యముగ తీర్మానించుకొన్నది. వేఱొండు ఆలోచన ఆమెకు లేదు.

ఆదంఖానుఁడు హాయిగ హుక్కా పీల్చుచు చెక్కుచెదరక యేదో కాలక్షేపము చేయుచుండెను. ఇందిర యావేళకే రాజోద్యోగులందఱకు విఖ్యాతమైన కారణమున నామెకు రాజసౌధమున నాటంకమనునది లేకపోయెను. శరవేగమున నా యువతి సరసర రాజప్రతినిధి యొద్ద కేతెంచి క్రోధసంక్షుభితమైన వక్షస్థలి నిమ్నోన్నత మగుచుండ మహారోషము నొందిన కాలభుజంగివలె బుసకొట్టుచు నిశితతర దృక్కుల నాతనిశరీరమును శూలఘాతబాధితముగ నొనర్చుచు నిలుచుండెను.

ఆదంఖానుఁ డామెయందు కలిగిన విపరీతమైన సౌందర్య వ్యత్యయమునకు స్వాంతమున విస్మయ మందకపోలేదు. తేజోరాశిగ నుండిన యాకాంత చలనమునందిన ప్రేతమువలె నాతనికి వెఱగుకొల్పెను. వాని నివ్వెఱపాటును బురస్కరించికొని యామె వానిని గుక్కుమిక్కుడకుండ చావఁదిట్టెను. తిట్టితిట్టి యలసిపోయినపిదప నామెను జూచి మోటుసరసముగ "ఏమి—" విష్ణుపండితుఁడు కారాగారవిమోచన మందినాఁడు కాఁడా? అట్టి సంపూర్ణస్వేచ్ఛ వాని కీక నెవ్వ రిచ్చియుందురు?—ఇందిరా, నా హృన్మందిరా! మనదాంపత్యసుఖమున కంతరాయముగ నుండువానిని మననిచ్చునంతటి తెలివిలేనికార్య మాచరింతునా? —" అనుచుండఁగా నా యువతి గిరుక్కునఁ దిరిగి పాఱిపోయెను.

నాఁటి నడిరేయి యిందిర యెవరికిని దెలియకుండ చంబాల్‌నదిలో నొకపడవ నెక్కి పయనము సాగించెను. చంబాల్‌నది యమునకు నొక యుపనది; ఉజ్జయిని నాను కొని పాఱుచున్నది. అట్లామె

కొన్నాళ్లలో కాళిందీముఖమున నాగ్రాపట్టణము దాటి ఢిల్లీనగరమును జేరెను.

ఢిల్లీపట్టణమున నాఁడు శృంగాటకము లన్నియు జనవికీర్ణము లయి అలజడి నందుచుండెను. శృంగాటకము లేకాక వీథులన్నియుఁగూడ ప్రజలగుంపులు గుసగుసలాడుచుండఁ బొంపిరివోవుచుండెను. "ఖానాఖాన్ వారు దారుణముగ వధింపఁబడిరి." అని వారు రహస్యముగ నొకరితో నొకరు చెప్పుకొనుచుండిరి.

ఇంతలోఁ గొందఱు రాజకీయోద్యోగు లొకజట్టుగఁ గూడి ప్రజ లనేకులు తమ్ము ననుగమింప రాజభవనమును సమీపించిరి. వారంద ఱొక్కమాటగ రాజదర్శన మపేక్షించి యాతనినోట సత్యాసత్యముల వినఁ గుతూహలము గనుపఱచిరి.

అక్బరుచక్రవర్తి తన ప్రజల కౌతూహలమును దీర్చుట కనుమతించి తన సౌధపు డాబాకడ కేతెంచి "చక్రవర్తి, చక్రవర్తి" అనుచు, "పద్దు, పద్దు" అనుచుఁ గ్రిక్కిరిల్లిన పౌరుల నొక్కపరి పరికించెను. నిశ్శబ్దమయ్యెను. చక్రవర్తి దుఃఖరుద్ధ కంఠముతో,

"మా గురూత్తములు మక్కాయాత్రఁ జేయుచు భౌతికశరీరమును వదలినమాట మా కెల్లరకును హృదయవిదారక మయ్యెను. మీ రెల్లరు నాతని యాత్మశాంతికయి యథోచితముగ నచ్చటచ్చట దుఃఖసూచకములగురీతులఁ బ్రవర్తించుకొనుఁడు. సాయంకాల మగుడు మేము జుమ్మామసీదున వారిజీవములకు శాంతిఁ గోరుచుఁ బ్రార్థనచేయవచ్చెదము."

అని నుడివి అశ్రుసిక్తనయనములతోఁ బ్రజల నెల్లరను మఱొక్కపరి తిలకించి మరలెను.

ఆ క్షణముననే జనమధ్యమునుండి "సార్వభౌమా, ధర్మభిక్ష ధర్మభిక్ష" అని యతిదీనమైన యబలారోదనము వినఁబడెను.

చక్రవర్తి మరలిన కాలు మరల్చుకొని ప్రజాసముదాయమువంకఁ జూచెను.

రూపముగ్ధులై ప్రజలు తమంతతా మిరుపాయలై వెనుక కొదిగి నిలుచుచుండ నిందిర పదుపాకనులఁ బడునట్లు నిలిచి రూపెత్తిన దైన్యమనునట్లు, బాహుద్వయము సాఁచి "ప్రత్యక్షజగత్సంరక్షకా, అభయము. శరణు. శరణు. న్యాయభిక్ష. అలాజనము నెడఁ గావించిన పైశాచికాపరాధమునకై ధర్మభిక్ష దయసేయుఁడు" అని ప్రలాపించెను.

వజీరులు, ఉమ్రావులు, సర్దారులు మొద లాబాలవృద్ధ మామె సౌందర్యమును, దైన్యమును జూచి యాశ్చర్యౌత్సుక్యచకితులై యట్లె చూచుచు నిలిచియుండిరి.

"కాంతామణీ, ధర్మభిక్ష మడుగఁబడిన తత్క్షణము పంచిపెట్టవలసినది మా ధర్మము. దేశకాలపాత్రముల యోజన మక్కఱలేదు. కాని-యింటివి కదా, మా నేటి శోకవార్త" అని ప్రవచించుచు, నామెదుఃఖము తన కంటెను మించియే యుండవలయు నని గ్రహించి "తల్లీ, మాదివాణపు ప్రాంగణములోనికి రమ్మా. నీయభాగ్యమును విని మరియు వెళ్లెదము." అని నుడివి లోనికి వెళ్లెను.

ప్రజాళి విస్మయమంది యామెను బరివేష్టించి దివాణమునఱకు వెంబడించెను. రాజాజ్ఞచేఁ గాఁబోలును భటులా జనమును వడఁబోసి యామెను చక్రవర్తిదర్శనమునకై ప్రవేశింపఁజేసిరి.

పానపావారిసమక్షమున యావద్వృత్తాంతము బూసగ్రుచ్చినతెఱఁగున నివేదింపఁబడెను. ఆమెవిషాదగాథ విన విన సక్బరునకు మఱే దానిపైనను యోజనపోలేదు. భామలు ముడివడుచుండ, మొగ మెఱ్ఱబాఱుచుండ, ఊపిరి వెచ్చఁబాఱి వడి వడియగుచుండ నోడుగఱచి సాంతము వినినాఁడు.

"సాధ్వీ, నీ మాటల యాథార్థ్యము దృఢపఱుప సాక్ష్య మున్నదా?"

"సార్వభౌమా, ఇదిగో ఆతఁడు నా జీవితేశ్వరుని నాకర్షింపవేసినదని చెఱసాలపాలకున కిడిన యానతిపత్రము; అతని స్వహస్త పరిలిఖితము. తిలకింపుఁడు.

"అర్ధరాత్ర మప్పుడే యురితీయవలయునని యారాత్రి నాకను బ్రామిపంపిన మఱొక్క యాజ్ఞాపత్రమును దమరు కోరినచో నా కారాగృహాధికారి చూపఁగలఁడు; నివేదింపఁగలఁడు.

"మహాప్రభూ, నాభర్త నిర్దోషుఁడని లోక మెఱుఁగును. తుద కాదంఖానుఁడే నమ్మినాఁడు. నమ్మియే నా గొంతు కోసినాఁడు." అని యాసాధ్వి యాక్రందించెను.

సార్వభౌముఁ డా పత్త్రముపుచ్చుకొని చక్కఁగ పరికించినాఁడు.

"అమ్మా, పాపమునకుఁ బ్రతిఫలము ననుభవింపఁగలఁడు. ఖండిత

ముగ మేము ధర్మ మొనర్చెదము." అని ధైర్యముచెప్పి యామెను బంపి వైచెను.

పీర్ ముహమ్మద్ షిర్వానీ యను సర్దారుఁడు ఆదంఖానుని బదలీ చేసి ఢిల్లీకిఁ బంపెను. రాజాజ్ఞ ననుసరించి, విషయ మిది యని తెలుపలేదు.

మాళవము నవలీలగా జయించిన శూరునకు నూతనగౌరవము లేవో వర్షింపఁబడనున్నవని మురియుచు పాదుషాసందర్శనము చేసిన యాదంఖానునకుఁ దనదురదృష్టము పొడ కట్టినది.

కటికవానికంటెను మిక్కిలి యధముఁడై తా నొనర్చిన ఘాతుకకృత్యములు పేర్కొనఁబడి వరుసగ తెలివిలేనన్ని ప్రశ్నలు వేయఁబడెను. బాజ్ బహద్దర తటివిద్రోహిని పాదాక్రాంత మొనర్చిన తన్నట్లు ప్రశ్నించుట సార్వభౌమునకుఁ దగవు కాదని యాదంఖానుఁ డనుకొనుచుండెను. సార్వభౌముఁడు తనకొక్కవరుసలో భ్రాతృసముఁడైనను, మొగము వాఁచునట్లు వానిని తీవ్రముగ దూషించెను.

అతఁ డిదంతయు నేదోయొక రాజకీయతంత్ర మనుకొని, తనపదవిని శంకించుకొనుచు, నందుపై తన్నన్యాయముగ నాతఁడు నిందలపాలు సేయుచున్నాఁడని ప్రతివచించెను.

"ఒక కాఫిరువిద్రోహి ప్రాణములు దీసినంత నేమాయెను? ఒక కాఫిరు విల్లాలిని కౌఁగిచినంత మాత్రమునఁ బుట్టిమునిఁగిపోయిన దేమి?

"గోరంతనుకొండంతలుగఁ జేసి తనపై నెవరో కుట్రపన్ని చాడీలు మోపియున్నారు. ఇది రాజబంధువులయెడఁ బాటింప నవసరములేదు" అని యాతఁడు నుడివినాఁడు.

పాదుషాకు వాని నెట్లయినను ఆత్మద్రోహ మొనర్చుకొనునట్లు చేయవలయు నని యుండెను. తోడనే యాతఁడు,

"కావునఁ బరిస్థితులగమనింపఁగా నీ విష్ణుఖండితుఁడు నిర్దోషుఁడైయుండ వచ్చును కాదా?" అని మార్దవముగ నడిగెను.

"చిత్రము. అసలు విద్రోహ మొనర్చిన విష్ణుఖండితుఁడు వేఱొక్కఁడు మాకుఁ దరువాత దొరకినాఁడు. ఈ విష్ణుఖండితునిచావు వాని దురదృష్ట మనవలసినదే!"

అక్బరు ప్రవర్తన మున్నట్లుండి సంపూర్ణముగ మాఱిపోయెను. కన్నుల విస్ఫులింగములు గురియ కఠినవచోనిర్ఘోషిని "ఛీ, సూకరమా, దురదృష్టమా? అంత చులుకనగఁ జూచుచుంటివా? గడ్డపార మ్రింగి సొంటికషాయమా?" అని భీకరముగ గర్జించెను. పిడుగులవంటి యామాటల కొకింత వెనుతగ్గి గొంతు సర్దుకొని వాఁడు "వాని నురికీయ నప్పుడు దోషియనుకొని నాధర్మము నిర్వర్తించితిని." అని సమర్థింపఁజూచెను.

"అట్లయినచో నిది యెందులకు స్పష్టింపఁబడెనో వచింపుము" అని వాని ముక్కునకు సరిగ నిందిరా రమణిద్వారా వాఁడు వ్రాసి యిచ్చి పంపిన [illegible]పత్రమునుంచి "పశువా, వచింపుము."

అని జలధరమాలా గంభీర గర్జనమున నదలించెను.

పుట్టినదాది యాదంఖానుఁ డెన్నఁడు నట్లు బెదరింపఁబడి యుండలేదు. మాహాంఆంగా తన్న రాజకుటుంబమున నొక రాజువలెనే పెంచెను. రాజమర్యాదల నాతఁ డనుభవించుచుఁ గూడ నుండెను. నేఁ డాతఁ డొక్క తుచ్ఛపు నేరస్థునిమాడ్కి సంప్రశ్నింపఁబడుచుండ వానికి దిక్కులు తోఁచలేదు. తన యకృత్యముల ప్రతిఫల మాతని కప్పుడే తట్టినది. గ్రుక్కిళ్లు మ్రింగికొనుచు నట్లే నిట్ట నిలుచుండెను.

"మా పేరను, పవిత్రమైన మా వంశగౌరవము పేరను నీ వాచరించుచుండిన పరిపాలనమా యిది? మా యపకీర్తికిఁ గారణభూతుఁడవై మా పరిపాలనము నిట్లు కళంకపఱచిన నిన్ను కండలుకండలుగ కోసి కాకులకు వైచినను పాపము లేదు.

"విష్ణుఖండితుని ద్రోహిగ నీవు నిశ్చయించియుండిన దీని నేల వ్రాసితివయ్యా!

"అదియు నెట్టి పరిస్థితులపైన— అబ్బ! నే నెట్టుఁ జెప్పుదను. జుగుప్సాకరము!

"పోనిమ్ము. అంతటి యధమాధమ వ్యాపారముఁ జేసికొంటివి కాదా, దాని నట్లే నిలుపుకొనరాదా? అంతటి ఘాతుకకృత్య మేల చేయవలయును?"

అవమానము, నధఃకరణము భారాతిభారమై తన్నుఁ గూల్చివైచుచుండ నాదంఖానుఁ డెట్లో యొండి ధైర్యము దెచ్చుకొని "నే... నేను ధర్మవ్యవస్థతోఁ బాటు—"

"ఛీ, తుచ్ఛశ్వానమా, నోరు మూయుము. ధర్మవ్యవస్థతోఁ బాటు

ఆత్మసైచ్ఛాలాభ పరాయణత్వమును సమ్మిళిత మొనర్చుకొంటివి కాంబోలును! నీవే మొగము పెట్టుకొని మాయెదుట బదులాడసాహసించుచుంటివో యెఱుకపడదు."

"ప్రభూ—" క్రోధపరవశత్వమున నేమోయనుటకు నోరెత్తినాఁడు.

"నరాధమా, నీవు కామాంధుఁడవై, మందుఁడవై యొనర్చిన పైశాచికకృత్యమునకుఁ గుఱియైన యీసాధ్వి యిటనే యున్నది. నీ పాపపరిణామముగ నీ తుచ్ఛశిరము నొక్కఁ ద్రేటునఁ ద్రుంచి యీయెదుటనే నీ సమర్పింప నాత్రపడుచుంటిని. కాని యామెకు నీవొనర్చిన పరిభవ దవానల మట్లుపశాంతిపొందునా యని సందేహముఁ దఁ బోయుచున్నాను."

ఏ కర్మప్రతిఫలమో కాని యాదంఖానున కొక యుక్తి తట్టినది. ఇందిర సుందరాకార మాతని హృదయమునఁ బ్రతిబింబించుచుండఁగాఁ బోలును "సార్వభౌమా, ఇందిర వితంతు వయిపోయినది. ఎట్లయిన నేనామెను సతంతువుగ నొనర్తును. నేను యావజ్జీవ సువివాహితుఁడనై యుండవలె ననుకొనియుంటిని. ఇప్పట్టునఁ దమ రనుమతించినచో నామెను నిక్కా చేసికొనెదను." అని యనెను.

వానిమాటలకు అక్బరునకుఁ జిఱునవ్వు తోఁచినది. కాని యతఁ డొక్కక్షణ మాలోచనానిమగ్నుఁడై "నీవు చేసిన ఘోరపాపమున కిది తగునైన ప్రాయశ్చిత్తము గాకపోవుట యటుండ నీయాత్మలాభ మినుమడించుచునే యున్నది. అయినను ప్రస్తుత మదియే కొంతవఱకు సమంజసమై యామెను గొంత ఆదరణీయముగ నొనర్పఁగల మార్గముగ నగపడుచున్నది.

"నీ కొక్క వారము గడువొసంగితిమి. అంతలో నీ వామె ననునయపఱచి వివాహమునకు, మతాంతరప్రవేశమునకు సమ్మతింపఁ జేసికొనుము. సమ్మతింపనిచో నీగతి పిదప కలదు." అని వచించి కక్ష్యాంతరప్రవేశ మొనరించెను.

ఇందిర కిది గోరుచుట్టుపైని రోఁకటి పోటు. ఎవ్వనిపై తీవ్రతరప్రతిహింసాప్రతిపాలనమునఁ గాని కషాయితరోష ముపశాంతింపదో అట్టి యధమాధముని, మతాంతరప్రవేశ మొనర్చి, పాణిగ్రహణ మొనర్చుకొనుటయా? అమానుషము. అంతకంటెను సజీవముగ కార్చిచ్చు నత్యానందమునఁ బ్రవేశింపవచ్చును.

అక్బ రామె నేకాంతముగఁ బిలువనంపి కొన్ని రహస్యముల నచ్చఁజెప్పెను. అతని వాక్యములలోని ప్రతిహింసాప్రక్రియ తనకు లాభకారి యని తోఁచినవెంటనే ఇందిర తాత్కాలికముగ నాదంఖాన పిశాచమును బెండ్లాడఁ దన యంగీకారమును సూచించెను.

అక్బరుసొంతమహాలున నాతని సమక్షమున వివాహము నిరాడంబరముగ జరిగెను. పెండ్లికూఁతు రొక జీవన్మృతకళేబరమువలె కన్పట్టెను.

మోహం అంగాకిదంతయు కడుపుమండెను. మాళవమున కాతనిని పట్టాభిషిక్తు నొనర్పవలయు నని యామె యక్బరు నెన్నోసారులు మందలించుచుండినది. ఇట్టి యధమ వివాహ మామెకు మిక్కిలి హీనముగ తోఁచెను. వివాహము జరుపరాదనియు, వెంటనే తన పుత్రునకు మాళవము నభిషేకింపనిచో నంతఃపురకల్లోలము కలిగింతు ననియు నామె అక్బరు ముఖ్యామాత్యుఁడయిన షామ్సుద్దీనుని మందలించెను. ఆ వృద్ధుఁ డా పలుకుల నొక లెక్కసేయలేదు. ఆమెకినుక తత్క్షణ మొక ఘోరతరప్రళయకార్యముగ పరిణమించెను.

వివాహవేదికను వీడి మాతృదేవ్యాశీస్సు లంద నేతెంచిన పుత్రు నొక ప్రత్యేకగృహభాగమునకుఁ బిలిచి వాని కష్టపరంపరల కన్నింటికిని షామ్సుద్దీన్ కారకుఁ డనియు, వాఁ డంత మొందినఁగాని యక్బరు చక్రవర్తి యాతనియెడఁ బ్రసన్నుఁడు కానేరఁ డనియు నుద్బోధించెను. కోఁతికి కల్లుపోసిన ట్లామెపలుకులు వానికి శివ మెత్తించినవి. ముందు వెనుకలు చూడక వాఁ డాక్షణముననే మేడపై కేఁగి నమాజు చేసికొనుచుండిన యావృద్ధసచివుని తల తెగనఱికివేసెను. బయట కొంచెము దూరమున నుండిన ప్రెగ్గడబంటు లాతఁడు లోని కేఁగివచ్చుటఁ జూచిరి. ఆశీస్సు లందుట కేఁగినాఁ డనుకొనిరి.

ఇంతలో సేవకుఁ డొక్కఁ డేతెంచి యాదంఖానుని చక్రవర్తి రమ్మనుచున్నారని పిలుచుకొనివెళ్లెను. ఇంతలో నీ రహస్య మెవ్వ రెఱుఁగరని నమ్మకముతో నాతఁడు హృదయావేగమును జంపివైచికొనుచు నక్బర్ పాదుషా యెదుట నిలిచెను. అతని సమీపమునఁ దన యధమము, నమంగళకరము నగు వదనము నగపడనీక మతాంతరశరణమున లభించిన మేలిముసుఁగున రూపెత్తిన సమస్త

దుఃఖములవలె నిందిర నిలిచియుండెను.

"ఆదంఖాన్, నీకొఱకై తనసర్వస్వమునైన మానధనమును వమ్ముచేసికొని మతమును పరిత్యజించి తన శరీరమునే యర్పించుకొన్న యీసుదతీలలామవివాహపుటోలి నీవేమియు నొసంగలేదు ఇద్దాని నొసఁగెద నని మాటమైన నాతో ననలేదు."

ఆ ధోరణియం దాతఁడు తనపరిణయవేళయం దేదో గొప్పబహూకృతి సేయనిచ్చగించి యుపన్యసించుచుండె నని యాతఁడు విశ్వసించి "చిత్తము, ప్రభూ, నన్నే యర్పించుకొంటినికావా!" అని సరసములాడెను.

"ఇదిగో, నీ వన్నది నిజమే యగుచో, నీ పత్త్రమున సంతకమొనర్పుము. నీ విదివఱ కార్జించియున్న సమస్తము నీమెవశ మగుచున్నది."

సార్వభౌముఁడు తన్నన్యాయమొనర్పుచున్నాఁడని యాతఁడు తలఁచెనుగాని పాదుషా తీక్ష్ణదృక్కులలోని తీవ్రత తన్ను భయకంపితునిగఁ జేయుచు బలవంతపఱచుచున్నందున తప్పించుకోలేక వణఁకుచున్న హస్తముతో సంతకము నొనర్చినాఁడు.

ఇంతలో షామ్సుద్దీనుని హత్యాసమాచారము రాజప్రాసాదమున ఘోషించెను. అతనిబంధుమిత్త్ర పరివారకోటియొనర్చిన హాహారావము సార్వభౌమునిచెవిలోఁ బడినది. ఆ యలజడికి నెదుటనున్న ఆదంఖానుని వ్యక్తిత్వమున వింతవింత భావోద్రేకములు కలిగి, అతనిముఖవికాసములు వికృతాకారముల సూచించినవి.

అతికుశాగ్రబుద్ధియగు నక్బరు కిది చక్కఁగ నేరస్థుని పట్టియిచ్చినది. నిశితతరదృక్కుల నాతని సమస్తదిశల శూలఘాతములవలెఁ గ్రుచ్చుకొనునట్లు పఱపుచు వజ్రకఠినమైన పలుకుములుకు లుట్టిపడ "ద్రోహీ, నీకరవాల మిట్లిమ్ము." అని యడిగెను.

అంతరంగ ముత్తుంగతరంగితము కాఁగా దోషి చుట్టును బరికించిచూచి యావలికే తన్ను వలయాకారముగఁ బరివేష్టించియున్న షామ్సుద్దీన్ సేవకులు(తన్నప్పుడు చూచినవారు) కంటఁబడఁగాఁ దనప్రయత్నమెట్లును విఫల మగునని తీర్మానించి, తనకటారిని పాదుషాకయివశము గావించెను.

రక్తసిక్త మయిన ఆ ఖడ్గమును జక్కఁగఁ బరిశీలించి చూచి,

"ఈరుధిర మమాత్యునిదేకదా? నిక్కము వచింపుము." అని కర్కశముగఁ బ్రశ్నించినాఁడు.

"............"

పిడి నొకచేత, మొన నొకచేతఁ బట్టి నడుమ మోఁకాలువంచి యక్బరా పాడుకత్తిని రెండుగ విఱిచివేసెను.

సమీపమున నిలచియున్న దండనాథిపతిని జూచి,

"ఈ ఘోరపాపుని తో లొలిచి నడివీథుల నూరేగించి, పురశృంగాటకమున వీనితలను నఱికి వ్రేలఁగట్టుఁడు" అని యాజ్ఞాపించెను.

"గుండుదెబ్బదినితుపాకివైపునకుఁ బాఱుతెంచు బెబ్బులివలె బొబ్బరించుచు ఆదంఖానుఁ డక్బరుమీఁది కొక్క దుముకున నెగిరి పైఁబడెను. ఇట్టి సన్నివేశమును బ్రతీక్షించియే యుండిన యా యువకచక్రవర్తి యొక్క చిన్నియుదుటున వాని పాటును దప్పించి గుఱిచూచి యొక్క గ్రుద్దు బలముగ వాని కడుపుపైని గ్రుద్దెను. ఆపోటున కాతఁ డొక్క యఱపఱచి నేలఁగూలెను.

తత్క్షణము చుట్టుపట్టులనున్న పరిజనము దిగ్భ్రమవీడి వానిపైఁబడి యదిమిపట్టి కాలుసేతులు బంధించివైచిరి.

"వీనిఁ గొంపోయి కోటకొమ్ముమీఁదనుండి నేలపైఁ బాఱవేయుఁడు. నేలపై వాఁడు పడుచోట సహస్రశూలములఁ బాతియుంచి వానిపైఁబడి కాకులు గ్రద్దల కాహారముగ చిత్రవధ నందనిండు." అని యక్బ రాజ్ఞాపించినాఁడు.

ఊరిచౌకున వానిని గట్టియుంచి వచ్చిపోవువారిచేతులయం దొక్కొక్క కొఱవి నిచ్చి వానిచేఁ గొంచెము కొంచెము కాల్పించి యుసురుపోసుకొనుట మంచి దని యచటనున్నవా రందఱును సలహో నిచ్చిరి. కాని ఆదంఖానుఁడు కోటకొమ్మునుండియే శూలారోహణము గావింపఁబడెను.

* * *

ఇందిర తనపని ముగిసినదని చితి నెక్కి తనతొలిమగనిఁ జేరుకొనవలయునని సంకల్పించియుండెను. అక్బరామె నా కార్యమునుండి విరమించున ట్లనేకవిధముల నుద్బోధించి యుజ్జయినికిఁ బంపెను.

మతాంతరప్రవేశమున కామె క్రుంగిపోవుచుండెను. ఇష్టజన బంధువర్గ మామెను దమలోఁ జేర్చుకొనలేదు. పగసాధించెనను గొప్పధనము

సైత మామెను ంధువు లోనఁగ లేదు.

అప్పుడప్పుడు పీర్ మహమ్మద్ షిర్వానీ మాళవపతిమాత్ర మామె నోదార్చుచుండెను. రాజకీయోద్యోగు లామెను సార్వభౌముని యాదర మందినదని గౌరవించ మొదలిడిరి.

ఎట్లో షిర్వానీ యామెహృదయమును దనవశమొనర్చుటయందు సఫలీకృతమనోరథుఁడైనాఁడు. అనతికాలమున సార్వభౌముని యాధ్వర్యమున నుజ్జయినీనగరమున నిందిరాషిర్వానీల పాణిగ్రహణమహోత్సవ మతివైభవముగ జరుపఁబడెను.

అరిగోలు

— (హంపివద్ద తుంగభద్ర నదిలో) —

D. A. R.